ఈనాడు వనపర్తి
సోమవారం అక్టోబరు 21, 2024
5

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పైరవీలు అవసరం లేదు

ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి దంపతులు. చిత్రంలో ఎంపీ మల్లురవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: యువతీ యువకులు చాలా మంది యువత ఉన్నత స్థాయికి చేరాలంటే పైరవీలు చేయాలన్న అపోహతో ఉన్నారని, దీన్నుంచి బయటపడాలని ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. పనినే నమ్ముకుని ఉన్నత స్థాయికి చేరవచ్చు నేందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చల్లా శ్రీనివాసులు శెట్టి ఆదివారం తొలిసారి సొంత జిల్లా వనపర్తికి వచ్చారు. పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన ఈయన తన కుటుంబ సభ్యుడు చల్లా విజయ్‌కుమార్ పట్టణంలోని పాత గంజి లక్ష్మీణపతి ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం వనపర్తి అగ్రికల్చరల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లు ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, బదావత్ సంతోష్ కుమార్ శ్రీనివాసులు శెట్టిని ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని సీఎస్ఆర్ నిధులతో వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 50 సైకిళ్లు పంపిణీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలానికి ఎస్బీఐ సంజీవని క్లినిక్ కింద ఇంటి వద్దనే వైద్యం అందించే అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ భారతదేశంలో చాలా మంది యువత ఉన్నత స్థాయికి చేరాలంటే పైరవీలు చేయాలని అపోహతో ఉన్నారని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే అందుకు తగ్గట్టు పని చేయాలని, అందుకు తానే ఉదాహరణ అన్నారు. వనపర్తి జిల్లాలో 55 శాతం డిపాజిట్లు ఎస్బీఐలో ఉన్నాయని అన్నారు. ప్రజలకు రుణాలు మంజూరు చేయడంలో భారతీయ స్టేట్ బ్యాంకు ముందంజలో ఉందన్నారు. జోగులాంబ రీజియన్ పరిధిలో 45 బ్రాంచులు ఉన్నాయని అందులో 21 పట్టణాల్లో, 24 గ్రామీణ ప్రాంతాల్లో 416 మంది ఎస్బీఐ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, అగ్రికల్చరల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి ఆయన్ను కలిసి సన్మానించారు.

శ్రీశైలం జలాశయం వద్ద సందడి

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతుండటంతో ఆ దృశ్యాన్ని తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు జలాశయం దృశ్య కేంద్రం వద్ద ఆగుతున్నారు.

వరి ధాన్యం నిల్వకు చోటేదీ?


పెబ్బేరు మార్కెట్ యార్డులో ప్రభుత్వ గోదాం

పెబ్బేరు, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వానాకాలం వరి ధాన్యం దిగుబడి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. వీటిలో ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని వారు భావిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిల్వ చేసుకోవడానికి జిల్లాలో సరిపడా గోదాములు లేవు. జిల్లా వ్యాప్తంగా 18 ప్రాంతాల్లో (స్టేట్ వేర్ హౌసింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇన్వెస్టర్ గోదాంలు) ఉన్న వాటిలో 1,32,500 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వ చేసుకోవచ్చు. ప్రస్తుతం వీటిలో 35 వేల మెట్రిక్ టన్నులకు సంబంధించిన బియ్యం, వరి ధాన్యం, గోనె సంచులు, పప్పుశనగ నిల్వలు ఉన్నాయి. కేవలం 97వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. మిగతా ధాన్యం ఎక్కడ నిల్వ చేయాలని అధికారులు ఆలోచనలో పడ్డారు.

జిల్లాలో ధాన్యం గోదాముల వివరాలు (సామర్థ్యం, నిల్వలు మెట్రిక్‌టన్నుల్లో..)

ప్రాంతం	యాజమాన్యం	సామర్థ్యం	ప్రస్తుతం నిల్వ	అవకాశం
చిట్యాల	ఎస్‌డబ్ల్యూసీ	10 వేలు	5 వేలు	5 వేలు
శ్రీరంగాపూర్	"	"	6,666	3,334
వీరాయిపల్లి	"	"	1,667	8,333
అన్నారం	"	"	–	10 వేలు
సూగూరు	"	"	1,667	8,333
అల్మాయిపల్లి	"	"	3,334	6,666
కొత్తపేట	ఐజీ	"	1,666	8,334
మదనాపురం	ఏఎంసీ	"	1,666	8,334
వెల్టూరు	"	5 వేలు	–	5 వేలు
చిట్యాల	"	10 వేలు	–	10 వేలు
పాన్‌గల్	"	5 వేలు	1,666	3,334
వీపనగండ్ల	"	"	–	5 వేలు
కొత్తకోట	"	"	1,666	3,334
గోపాల్‌పేట	"	"	5 వేలు	–
పెబ్బేరు	"	"	"	–
దగడపల్లి	"	2,500	–	2,500
ఆత్మకూరు	"	5 వేలు	–	5 వేలు
ఖిల్లాగణపురం	"	"	–	"

వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు..

రైతులు పండించిన వరి ధాన్యానికి సన్నాలకు, దొడ్డు రకాలకు సంబంధించి ప్రభుత్వం వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకుంది. సన్న వడ్లను సూక్ష్మ మీటరు ద్వారా గుర్తించడం కోసం ఏర్పాట్లను సిద్ధం చేసి కొనుగోలు చేసే నిర్వాహకులకు డీఆర్‌డీవో అధికారులు శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరి ధాన్యానికి రూ.2,320 ఉండగా.. బోనస్ కలుపుకొని రూ.2,820 అవుతోంది. లావు రకాలకు మాత్రం రూ.2,320 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది.

వివరాలు సేకరిస్తున్నాం



రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నేరుగా గోదాముల్లో నిల్వ చేసేందుకు జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ గోదాములున్నాయో.. వాటిలో ఎంత మేరకు నిల్వ చేసేందుకు అవకాశం ఉంటుందో తదితర వివరాలు సేకరిస్తున్నాం. వీటిని ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్కడ నిల్వ చేయాలనేది నిర్ణయిస్తాం. **- నగేశ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వనపర్తి**

అంతులేని అవకతవకలు

- మహిళా సమాఖ్యల్లో అటకెక్కిన అధికారుల పర్యవేక్షణ
- అమలు కాని సంఘాల నియమావళి



న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

అధికారుల నిర్లక్ష్యంతోనే పురపాలికల్లోని మెప్మా పరిధి మహిళా సంఘాల సమాఖ్యలు, మహిళా సంఘాల్లో భారీఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. సంఘాలను సీవోలు, డీఎంసీలు పర్యవేక్షించాలి. వారు ఎలా పనిచేస్తున్నారో మెప్మా పీడీలు, పుర కమిషనర్లు ప్రతి మూడు మాసాలకు ఒకసారి సమీక్షించాలి. ఈ రెండంచెల విధానం పదేళ్లుగా మరుగున పడటంతో సంఘాలు, సమాఖ్యల్లో ఆర్థిక నేరాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.


కోయనగర్ సమాఖ్య లావాదేవీల్లో అవకతవకలు తనిఖీ చేస్తున్న సీవోలు, ఆర్పీల బృందం

ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల పరిధిలో 457 మహిళా సంఘాల సమాఖ్యలు ఉండగా వాటి పరిధిలో 11,367 సంఘాలు ఉన్నాయి. సభ్యులుగా ఉన్న 4,13,670 మంది మహిళలు ప్రతి నెలా రూ.4,13,67,000 వరకు పొదుపు చేస్తున్నారు. ఈ పొదుపును బట్టే బ్యాంకులు, స్త్రీనిధి బ్యాంకులు మహిళలకు వ్యక్తిగత, సామూహిక రుణాలు ఇస్తున్నాయి. ఆర్పీలు, సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి(ఓబీలు) మహిళలను తప్పుదోవ పట్టిస్తూ రుణంగా వస్తున్న రూ.లక్షల డబ్బు కాజేస్తున్నారు. బ్యాంకు నోటీసులందుకుని అమాయక మహిళలు రోడ్డున పడుతున్నారు.

పాతుకుపోయిన ఆర్పీలు, సీవోలు : ఆర్పీలను రెండు, మూడేళ్లకోసారి మార్చాలన్నది మెప్మా నియమావళిలోనే ఉన్నా పాతికేళ్లుగా అమలు కావటం లేదు. అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి(ఓబీల)ను మాత్రమే మారుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 457 ఆర్పీలు, 914 ఓబీలు పని చేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో ఆర్పీలు ఏళ్లుగా పాతుకుపోవడం వల్ల భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. 94 సమాఖ్యలకు 94 మంది ఆర్పీలు ఉండగా సగానికి పైగా మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. అక్రమాలకు పాల్పడిన ఓ ఆర్పీ మూడేళ్ల క్రితం అదృశ్యమయ్యారు. ఇటీవల మరో ముగ్గురి నుంచి డబ్బుల రికవరీకి ఆదేశించటంతో వారు విధుల నుంచి తప్పుకొని ముఖం చాటేశారు. తాజాగా కోయనగర్ ఆర్పీ కూడా రూ.1.49 కోట్ల వరకు అవకతవకలు చేసినటుల తేలగా మహిళలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీవోను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గుమ్మడి కాయల దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్లు అవకతవకలు చేసిన ఆర్పీలు తమపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనని ఎమ్మెల్యేను, పురపాలిక ఛైర్మన్‌ను తరచూ కలుస్తూ సంజాయిషీలు ఇస్తున్నారు. మిగతా సమాఖ్యల్లోనూ అధికారులు పకడ్బందీగా విచారణ జరిపిస్తే భారీ మొత్తంలో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంటుందని మహిళలు చెబుతున్నారు. ఆర్పీల లాగే సీవోలను కూడా ప్రతి మూడేళ్లకు ఒకసారి వార్డులు మార్చాల్సి ఉన్నా చేయటం లేదు. ఏళ్ల తరబడిగా పాతుకుపోవటంతో ఆర్పీలు, ఓబీలతో సంబంధాలు బలపడి ఆర్థిక అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇకనైనా ఆర్పీలను తొలగించి మహిళా సంఘాల తీర్మానంతో కొత్త వారిని నియమించాలని, సీవోలను బదిలీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

మొక్కుబడిగా ఏజెన్సీల ఆడిట్ : సమాఖ్యల ఆడిట్‌ను ఏటా స్థానికంగా ప్రైవేటు ఏజెన్సీలతో చేయిస్తున్నారు. ఆర్పీలు బ్యాంకర్లకు సమర్పించే సూక్ష్మ రుణ ప్రణాళిక దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సమాఖ్యల్లోని ఒక్కో సంఘానికి ఏడాదిలో ఎంత రుణం మంజూరైంది.. రుణాలు తీసుకుంటున్న మహిళలు సంఘాల సభ్యులేనా.. సంతకాలు వారివేనా.. రుణం తిరిగి చెల్లిస్తున్నారా.. లేదా అనేది తేల్చాలి. అలా చేయటం లేదు. ఆర్పీలు, ఓబీలు ఇచ్చే దస్త్రాలనే పరిశీలించి ఒకటి, రెండు రోజుల్లో ఆడిట్ పూర్తిచేస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క అక్రమాన్నీ గుర్తించిన దాఖలాలు లేవు. మెప్మా ఉన్నతాధికారులు కూడా ఏటా సమాఖ్యల ఆడిట్‌కు ప్రధాన కార్యాలయం నుంచే అగ్రశ్రేణి ఆడిటర్లను పంపించాల్సి ఉన్నా చేయటం లేదు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు



అచ్చంపేట, న్యూస్‌టుడే : సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)-1 పరీక్షలు ఉమ్మడి జిల్లాలో సోమవారం ప్రారంభం కానున్నాయి. అన్ని జిల్లాల్లో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు జిల్లాల్లో డీఈవోల ఆధ్వర్యంలో డీసీఈబీ కార్యదర్శులు పరీక్షలను పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 4,187 పాఠశాలల్లో 1-10 తరగతి చదువుతున్న 5,42,536 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. పాఠశాల విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే కాలపట్టికను తయారు చేసి పాఠశాలలకు డీఈవోల ద్వారా పంపింది. ఈ నెల 21 నుంచి 28 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు.

పాఠశాలలకు చేరిన ప్రశ్నపత్రాలు..

ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రశ్నపత్రాలను ఆయా జిల్లాల ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) ద్వారా ఎంఈవోలకు అందజేశారు. మండల వనరుల కేంద్రాల నుంచి హెచ్ఎంలు పాఠశాలలకు ప్రశ్నపత్రాలు తీసుకెళ్లారు. ఉదయం 6, 8, 10 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 7, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 21 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 6, 8 తరగతుల విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28 వరకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7, 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

జిల్లా వివరాలు..

ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
370	130	192	86,706

పత్తి అమ్మకానికి దారేదీ?



ఆన్‌లైనులో నమోదు కాక కౌలురైతులకు పాట్లు


పాలమూరులో ఓ జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తితో వచ్చిన వాహనాలు

మహబూబ్‌నగర్, ఈనాడు : ఉమ్మడి జిల్లాలో 2,87,625 మంది చిన్న, సన్నకారు రైతులు, 26,760 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 70 శాతం వరకు రైతులు తమ సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 6.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సుమారు 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తోంది. బయటి మార్కెట్‌లో పత్తి పంటకు సరైన ధర రావటం లేదు. ఈసారి క్వింటా పత్తికి సీసీఐ రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ఆ ధర పొందుదామంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు.

సాంకేతిక సమస్యలు

వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో ఏ పంటలు, ఎవరు సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కౌలు రైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరునే నమోదు చేశారు. దళారుల కట్టడికి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట సాగు చేసినట్లు ఎవరి పేరు నమోదు చేసి ఉంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు, పాసు పుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. కౌలు రైతులు సీసీఐకి వెళ్లి పత్తి పంట అమ్ముకోవాలంటే పట్టాదారు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకంతో కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ఇందుకు పట్టాదారులు అంగీకరించటం లేదు. ఈ పరిస్థితిలో కౌలు రైతులు తమ పంట మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

గత్యంతరం లేక ప్రైవేటుకు

ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ 28 జిన్నింగ్ మిల్లులను గుర్తించింది. ప్రస్తుతం అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. రైతులు తీసుకొచ్చే పత్తిని మాత్రం తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో లేదని, ఇతర కారణాలు చెప్పి కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లు వాళ్లకే తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. కొన్ని చోట్ల జిన్నింగ్ మిల్లులకు సీసీఐ అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

గ్రామాల్లోకి దళారులు..

సీసీఐ కేంద్రాల్లో చాలా మంది కౌలు రైతుల పత్తి కొనుగోలు చేయకపోవటంతో దళారుల దృష్టి వారిపై పడింది. ఇప్పటికే గ్రామాల్లో అడ్డావేసి తాము పంటను కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. పంట తడిసిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని క్వింటాకు రూ.4,500 నుంచి రూ.6వేలే ధర చెల్లిస్తున్నారు. దీనిపై సీసీఐ మహబూబ్‌నగర్ డీజీఎం మహేశ్వర్‌రెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పత్తి సాగు చేసినట్లు నమోదైన వారు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకంతో పంట తీసుకొస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. వారు కౌలు రైతా, పట్టా రైతా అనేది తాము చూడమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ.. సాగులో కౌలు రైతు ఉన్నా పట్టాదారు పేరునే నమోదు చేస్తామని వెల్లడించారు. పట్టాదారుడితో కౌలుదారులు సమన్వయం చేసుకుని వారి పంట విక్రయించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు అపార్ కార్డు

- అందులోనే సమగ్ర సమాచారం
- తల్లిదండ్రుల అంగీకారపత్రం తీసుకోవాలని ఆదేశాలు



అమరవాయి ఉన్నత పాఠశాలలో అపార్ కార్డుల కోసం ఇస్తున్న అంగీకార పత్రాలతో తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

జాతీయ విద్యా విధానంలో భాగంగా 'ఒక దేశం - ఒక విద్యార్థి ఐడీ' నినాదంతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక కార్డు అందించనుంది. అపార్(ఏపీఏఏఆర్ - ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో ఆ కార్డును అందించేందుకు గతేడాది ఆదేశాలు వచ్చినా రాష్ట్రంలో అమలు కాలేదు. తాజాగా తిరిగి ఆదేశాలు రావడంతో శనివారం నిర్వహించిన పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం)లో దీనిపై అవగాహన కల్పించారు. ఆధార్ తరహాలో దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ఐడీ సంఖ్యను కేటాయించనున్నారు.



అపార్ వెబ్‌సైట్ ముఖచిత్రం

తల్లిదండ్రుల అంగీకారంతోనే..: అపార్ కార్డు వివరాలు గోప్యంగా ఉంచుతామని కేంద్రం చెబుతోంది. తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు దరఖాస్తులు చేశారు. విద్యార్థి ఆధార్, బోనఫైడ్ వివరాలు అక్షరం తప్పులేకుండా ఉంటేనే అపార్ సంఖ్య జనరేట్ అవుతుంది. ఒకసారి కార్డు వచ్చిందంటే మార్పులకు అవకాశం ఉండదు.

ఉమ్మడి జిల్లాలో..: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజకవర్గాల పరిధిలో 4,800కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. 250కి పైగా ఇంటర్, డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో సుమారు 6.10 లక్షల మందికి పైగా విద్యార్థులు పూర్వ ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు చదువుతున్నారు. ఇప్పటివరకు పిల్లలకు పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో వేర్వేరు ఐడీలు కేటాయించేవారు. అపార్ ఐడీ కార్డు వస్తే ఒకే కార్డులోనే సకల సమాచారం ఉంటుంది.

జీవితకాల ఐడీగా: 12 అంకెల సంఖ్య విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులందరికీ కేటాయిస్తారు. ఇందులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, కేజీ టూ పీజీ విద్యా సంవత్సరం వివరాలు, సాధించిన విజయాలు, స్కాలర్‌షిప్‌లు, మెమోలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. విద్యార్థి ఖాతా డిజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. దీంతో విద్యా సంస్థల ప్రవేశాలు, ప్రవేశ పరీక్షలకు, ఉద్యోగాలకు విద్యార్థి ఐడీ నమోదు చేస్తే అన్ని వివరాలు తెలుసుకోవడం సులువవుతుంది.

భవిష్యత్తులో కీలకం: అపార్ కార్డు విద్యార్థులకు కీలకం. ఇందుకు తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించాం. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది.
-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

మత రాజకీయాలను ప్రతిఘటిద్దాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

పాన్‌గల్, న్యూస్‌టుడే : దేశంలో హిందూమతం పేరుతో భాజపా చేస్తున్న రాజకీయాలను కమ్యూనిస్టులుగా ప్రతిఘటించాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉమామహేశ్వర్ పిలుపు నిచ్చారు. ఆదివారం పాన్‌గల్‌లో సీపీఐ ఒక్క రోజు రాజకీయ శిక్షణ తరగతులు ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణ తరగతులకు ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 'సమకాలీన రాజకీయాలు కులం, మతం' అంశంపై వారు మాట్లాడారు. కేంద్రంలోని భాజపా దేశ సంపదను సంపన్నులకు దోచిపెడుతూ, కష్టజీవుల ప్రయోజనాలు గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. గ్రామాల్లో సీపీఐ బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజయరాములు, కళావతమ్మ, రమేశ్, గోపాల్, మహేశ్, రవీందర్, చంద్రయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎల్‌టీం సభ్యులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న స్థానిక అధికారులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ

చిన్నంబావి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు మండలంలోని వెలటూరులో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు పథకాల అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దస్త్రాలను పరిశీలించి, చేపట్టిన పనులను పర్యవేక్షించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎల్‌టీం సభ్యులు మధుసూదన్ దేశ్‌పాండే, ప్రవీణ్ పాటిల్, ఏపీడీ ప్రభాకర్, ఎంపీడీవో రమణారావు, ఏపీవో ధనుంజయరాజు, ఏపీఎం మద్దిలేటి పాల్గొన్నారు.

రెండు నదుల్లోనూ పెరుగుతున్న వరద


జూరాల గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ధరూరు, శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: ఇటు కృష్ణా, అటు తుంగభద్ర నదుల్లో వరద పెరుగుతోంది. జూరాల జలాశయంలోకి ఆదివారం సాయంత్రం 1.20 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. 23 గేట్లు ఎత్తి 94 వేల క్యూసెక్కులు, జలవిద్యుదుత్పత్తి ద్వారా 33 వేల క్యూసెక్కులు మొత్తం 1.27 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 60వేల క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 59 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 88 వేలు చేరుతుండగా దిగువకు 86 వేల క్యూసెక్కుల వదులుతున్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అటు కర్ణాటక ప్రాజెక్టులకు ఇటు జూరాలకు వరద కొనసాగుతోంది

తుంగభద్ర: నదిలో 66,252 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 11.7 అడుగుల ఎత్తులో నీటిపారుదల ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.1 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చే సరికి అది 5 అడుగులుగా ఉంది. ● సుంకేసుల జలాశయానికి 95,500 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో 22 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 93,300 క్యూసెక్కులను శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2 వేల క్యూసెక్కులు వదులుతున్నామని డ్యాం అధికారులు తెలిపారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..



ధరూరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విదేశాల్లో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయి. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లే వారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణా శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అవగాహన లేక దళారులను ఆశ్రయించి అధిక మొత్తం సొమ్ము ఖర్చు చేసుకుంటున్నారు. అసలు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలంటే..

విద్య కోసం: ఉన్నత విద్య అభ్యసించటానికి అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యాతో పాటు పలు దేశాలకు వెళ్తుంటారు. ఆయా దేశాలకు వెళ్లిన వారు గ్రీన్ కార్డు హోల్డర్లుగా మారి అక్కడే స్థిర పడుతుండగా మరి కొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరి అయ్యింది. ఈక్రమంలో చాలా మంది ఐడీఎల్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

లెర్నింగ్ మాదిరిగా: రాష్ట్ర రవాణా శాఖ జారీ చేసే అంతర్జాతీయ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. ఆయా దేశాల వాహనాలు నడపటానికి అనుమతి ఇస్తారు. ఒక రకంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాల్లో ఏడాది కాలం లెర్నింగ్ లైసెన్స్‌గా చెల్లుబాటవుతుంది. నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.


మీ కోసం

పొందడం ఇలా

● అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఐడీఎల్ దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్టు (కనీసం 6 నెలల గడువుతో) మనం ఏ దేశానికి వెళ్తున్నామో దానికి సంబంధించిన వీసా జతచేయాలి. వీసా తర్వాత వస్తుందని అనుకుంటే అందుకు సంబంధించి ఇతర ఆధారాలు అందజేయాలి.

● ఆరోగ్య పరంగా వైద్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఫాం-ఏ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్ని సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు.

● ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు 1,250 వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు.



అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ నమూనా

అమెరికాలో నిబంధనలు కఠినం: అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలుంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవటానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాలి. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించే సమయంలో ఎంవీఐ పక్కన కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన ఛోదనను పరిశీలించి ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఏవైనా పొరపాట్లు చేస్తే వాటికి రుజువు చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

మనింట్లోనూ స్మార్ట్ జాంబీలు



● బానిసెల్‌ అవుతున్న చిన్నారులు

● వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు


అన్నం తినడానికి, అల్లరి చేయకుండా కుదురుగా కూర్చోవడానికి గద్వాల పట్టణానికి చెందిన ఓ తల్లి కుమారుడికి చరవాణి ఇచ్చేది. ఒకటో తరగతి వచ్చిన ఆ పిల్లాడు ప్రస్తుతం ఫోన్ ఇవ్వక పోతే అందరిని కొడుతున్నాడు. గట్టిగా ఏడుస్తున్నాడు. చేసేది లేక వారు మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు.

ఉమ్మడి జిల్లాలో ఓ మండలానికి చెందిన ఏడో తరగతి బాలుడు ఇంట్లో అందరూ నిద్రించాక రాత్రి ఎప్పుడు మెలకువ వచ్చినా అప్పుడు, తండ్రి ఫోన్ తీసుకొని గంటల తరబడి వాడటంతో అలవాటుగా నిద్రలేచేవాడు. దీనివల్ల కంటి సమస్య, చికాకు, నీరసం వంటి సమస్యలు వచ్చి చదువులో వెనుకబడ్డాడు.

రాజోలి, న్యూస్‌టుడే: పాలు తాగే పిల్లలు ఆకలితో ఏడిస్తే కన్నతల్లి దగ్గరకు తీసుకొని కడుపు నింపేది. భయంతో ఏడిస్తే నేనున్నాని భరోసా నింపుతూ ఎత్తుకొని లాలించేవారు. చందమామను చూపిస్తూ.. గోరు ముద్దలు తినిపించే వారు.. కథలు చెబుతూ.. పాటలు పాడుతూ నిద్ర పుచ్చే వారు. స్మార్ట్‌ఫోన్ పుణ్యమాని ఇవన్నీ మాయమైపోయాయి. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. పిల్లలు మారాం చేస్తే చాలు సెల్‌ఫోన్ చేతిలో పెడితే ఏడుపు ఆపేస్తోంది. పిల్లలు గంటల తరబడి స్క్రీన్ టైం గడుపుతూ వాటికి బానిసలై 'స్మార్ట్ జాంబీలు'గా మారిపోతున్నారు. ఆటలు ఆడుతూ గడపాల్సిన బాల్యం, చరవాణిలో బందీ అవుతోంది.

ఇవీ అనర్థాలు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు మానసిక వైద్యుల వద్దకు తీసుకొస్తున్న పిల్లల్లో సింహభాగం సెల్‌ఫోన్ బాధితులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పిల్లలు రోజూ 3 - 4 గంటలు చరవాణి చూడటం వల్ల మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, 5 ఏళ్ల లోపు చిన్నారులు రోజుకు ఒక గంట కంటే ఎక్కువ ఫోన్ చూడకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. స్మార్ట్ స్క్రీన్ నుంచి విడుదలయ్యే బ్లూ లైట్ వారి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని, రేడియేషన్ ప్రభావంతో నెగెటివ్ ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

10 నుంచి 15 ఏళ్లలోపు 100 మంది పిల్లల సర్వేలో తేలిన అంశాలివి



సర్వేలు, పరిశోధనలు చెబుతున్న నిజాలివి



● ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 99 శాతం మంది మొబైల్‌ఫోన్లు, గాడ్జెట్‌లకు అలవాటు పడుతున్నారు.

● దేశంలో 66 శాతం మంది తల్లిదండ్రులకు తమ పిల్లలు అధిక స్క్రీన్ సమయం వెచ్చిస్తుండటం ప్రమాదకరమని తెలియదు.



● ఓ అధ్యయనం ప్రకారం 65 శాతం కుటుంబాలు తమ పిల్లలు అన్నం తినడానికి ఫోన్లు, టీవీలు చూపిస్తున్నారు.

● 12 నెలల వయసున్న పిల్లలు రోజుకు 53 నిమిషాలు స్మార్ట్‌ఫోన్ చూస్తున్నారు. 3 సంవత్సరాల పిల్లలు గంటన్నరకు పైగా చూస్తున్నారు. ● చరవాణి అతిగా వాడే పిల్లల్లో మెదడు, వినికిడి, మాట్లాడే సామర్థ్యంపై ప్రభావం పడుతుందని వెల్లడైంది. ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని వారు కోల్పోతున్నారు.

తల్లిదండ్రులు ఏం చేయాలంటే...

● పిల్లలకు వీలైనంత వరకు డిజిటల్ తెరలకు దూరంగా ఉంచడమే శ్రేయస్కరం. శారీరక శ్రమ కలిగించేలా ఆటలు ఆడించడం, నైపుణ్యాలను పెంచే విధంగా తల్లిదండ్రులు వారికి సూచనలు చేయాలి. నెమ్మదిగా ప్రయత్నిస్తే ఇది సాధ్యమే.



● పిల్లలున్న సమయంలో తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ వాడకపోవడం మంచిది. లేదంటే పెద్దలు చూసే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, రీల్స్‌కు త్వరగా అలవాటు పడతారు. ముఖ్యంగా గేమ్స్ ఆడకుండా చూడాలి. ● బడి నుంచి ఇంటికి రాగానే దగ్గరుండి వారితో హోమ్‌వర్క్ చేయించాలి. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి తరచూ పిల్లలకు వివరించాలి.

కుంగుబాటుకు కారణం

స్మార్ట్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపే వారు ఎవ్వరితో మాట్లాడరు. ఆడుకోరు. తల్లిదండ్రులతో అరవడం, వాగ్వాదం చేస్తుంటారు. మానసికంగా కుంగిపోతారు. సెల్‌లో గేమ్స్ ఎక్కువగా ఆడటం వల్ల డిప్రెషన్‌లోకి వెళ్తారు. ఈ మధ్య ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. తల్లిదండ్రులు ఆటలు ఆడించడం, వారితో కలసి ఆడటం, తోటి పిల్లలతో కలిసేలా చేయడం తదితరాలు చేయాలి.



-డా.హేమలత, మానసిక వైద్య నిపుణురాలు, గద్వాల

23న పీయూలో క్రీడాకారుల ఎంపికలు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి రెండు రోజుల పాటు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పీడీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్‌జోన్, అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు సంబంధించి బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో 23న, మహిళల క్రికెట్ 25న, అదే రోజు క్రాస్ కంట్రీ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 17 నుంచి 25 వరకు ఉండాలన్నారు. ప్రస్తుతం వివిధ కళాశాలల్లో చదువుతున్న అభ్యర్థులు, తమ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆదివారం సీఎం కప్ క్రీడా జ్యోతి జిల్లాకు చేరుకోగా స్వాగతం పలికి, క్రీడా జ్యోతి పరుగును కలెక్టర్ ఎస్పీ డి. జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌తో కలసి ప్రారంభించారు. ఈ పరుగు డీఎస్ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ డైట్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీఎం కప్ క్రీడా టోర్నీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సాట్స్ ప్రతినిధులు రతన్‌బోస్, గోకుల్ యాదవ్, సాయిబాబా, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు ర్యాలీలో పాల్గొన్నారు.



పరుగు ప్రారంభోత్సవంలో క్రీడాజ్యోతితో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు

జాతీయ సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి రజతం


కె.కార్తీక్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 5వ సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా వాసికి రజతం దక్కింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కె.కార్తీక్ హెప్టఅథ్లాన్ విభాగంలో ప్రతిభ చాటి రజతం కైవసం చేసుకున్నాడు. రాష్ట్రానికి రజతం సాధించిన అథ్లెట్‌ను అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి జి.శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్ర కుమార్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేశ్ చందర్, సభ్యులు ఆనంద్, సాదిఖ్, సునీల్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ నేపథ్యంలో ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఎండీసీఏ మైదానంలో 21 నుంచి 28 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, కొడంగల్ జట్లు పాల్గొంటున్నాయి. పూల్-ఏలో మూడు, పూల్-బిలో మూడు జట్లను విభజించి ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌ల చొప్పున ఆడాల్సి ఉంటుంది. ఈ వన్డే టోర్నీలో పూల్-ఏ విన్నర్‌తో పూల్-బి విన్నర్ జట్టు ఫైనల్‌లో తలపడతుంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేయనున్నారు. ఎంపికయ్యే ఉమ్మడి జిల్లా జట్టు నవంబర్ 4వ తేదీ నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి హెచ్‌సీఏ టోర్నీలో పాల్గొంటుంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాలమూరుకు ద్వితీయ స్థానం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్ బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వంగూరు, న్యూస్‌టుడే : డిండి ఎత్తిపోతల (డీఎల్ఐ) కాలువ పనుల్లో భాగంగా మండలంలోని నర్సంపల్లి గ్రామ సమీపంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఆదివారం బ్లాస్టింగ్ సందర్భంలో అదే గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. నర్సంపల్లి గ్రామానికి చెందిన దేరంగుల శ్రీను, కృష్ణవేణి దంపతుల కుమారుడు రిషితేజ వంగూరులో 10వ తరగతి చదువుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న డీఎల్ఐ కాలువ పనుల వద్ద గుత్తేదారుడు బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు చాలా దూరం వేగంగా వచ్చి పడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రిషితేజకు ఓ రాయి వేగంగా వచ్చి తగిలింది. చేతికి తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.


ప్రజల రక్షణకు ప్రాణత్యాగాలు

ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నేరవిభాగం

శాంతి భద్రతలు, ప్రజల రక్షణకు.. రాత్రింబవళ్లు పని చేసేది పోలీసులే. ప్రజలంతా హాయిగా నిద్రపోతుంటే వారు గస్తీ కాస్తుంటారు. అందరూ పండగ చేసుకుంటే వారు బందోబస్తులో తలమునకలుగా ఉంటారు. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఉమ్మడి జిల్లాలో 39 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారు. అలాంటి పోలీసుల సేవలు, త్యాగాలను గుర్తు చేసుకుని వారికి నివాళి అర్పించేందుకు ఏటా అక్టోబర్ 21న **'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం'** నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1990-2000 మధ్య కాలంలో మావోయిస్టుల ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. అచ్చంపేట, అమ్రాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, గద్వాల, వనపర్తి, వీపనగండ్ల, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, కొత్తకోట, మక్తల్, కృష్ణ, వెల్దండ, వంగూరు, బల్మూరు తదితర ప్రాంతాల్లో మావోయిస్టు దళాలు ఉండేవి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. మావోలు గుర్తించకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సాధారణ దుస్తుల్లోనే విధులు నిర్వహించేవారు. ప్రత్యేక వాహనాల్లో ప్రయాణించేవారు కాదు. ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగించేవారు. మందుపాతరలు, ఎదురుకాల్పులు సర్వసాధారణం. ఎప్పుడు ఎక్కడ ఏ ఘటన జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట సమయంలో పోలీసులు ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారు.



బస్సును పేల్చిన ఘటనలో..

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టులు జరిపిన దాడుల్లో అతి పెద్ద ఘటన సోమశిలదే. కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద కొందరు మావోయిస్టులు 1993 నవంబర్ 13న ఆర్టీసీ బస్సును దగ్ధం చేయటంతో పాటు అక్కడే ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని మందు పాతరతో పేల్చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించడానికి 14వ తేదీన అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశీ నాయుడు, వనపర్తి డీఎస్పీ, ఇద్దరు ఎస్సైలు, 30 మంది వరకు పోలీస్ సిబ్బంది ఒక ప్రైవేటు బస్సులో వెళ్లారు. బస్సు టాప్‌పై ఉన్న ఆయుధాలను గమనించిన మావోయిస్టులు అందులో ఉన్నది పోలీసులేనని నిర్ధారించుకున్నారు. సోమశిలకు వెళ్లి వివరాలను తెలుసుకున్న ఎస్పీ, పోలీసులు తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మందుపాతరతో బస్సును పేల్చేశారు. వెంటనే కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎస్పీ పరదేశీ నాయుడుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఆరుగురు పోలీసులు మృతిచెందారు. ఈ ఘటన అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సంచలనంగా మారింది. 1997 మే 17న అమ్రాబాద్ నుంచి ఎస్సై మన్సూర్ తన సిబ్బందితో కలిసి జీపులో వెళ్తుండగా అదే మండలంలోని లక్ష్మాపూర్ వద్ద మావోయిస్టులు మందు పాతరతో వాహనాన్ని పేల్చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో నలుగురు పోలీసులు చనిపోయారు. 2015లో సూర్యాపేట ఆర్టీసీ బస్టాండులోని ఓ బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో జడ్చర్లకు చెందిన ఎస్సై సిద్దయ్య అసువులు బాశారు. ఇలా అనేక ఘటనల్లో పోలీసులు ప్రాణత్యాగం చేశారు. వారిని స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్‌తో పాటు వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ శైవక్షేత్రం దక్షిణకాశీ బాలబ్రహ్మేశ్వర స్వామి, అయిదో శక్తిపీఠమైన జోగులాంబ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలి వచ్చారు. స్వామికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబ అమ్మ వారికి త్రిశతి, ఖడ్గమాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆలయాల సమీపంలోని తుంగభద్ర నదిలో పడవలో చెక్కర్లు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. పుష్కర్ ఘాట్ నుంచి నది పరవళ్లను తిలకించారు.


జోగులాంబ ఆలయంలో భక్తులు

27న అన్నమాచార్య సంకీర్తనాలాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం తిరుమలదేవుడి గుట్టలో వెలసిన శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 54 సంకీర్తనల గానాలాపన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టనున్నట్లు గాయకుడు, అన్నమయ్యవాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు గద్వాల చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. లోకకల్యాణార్థం 27వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గానకచేరి ఉంటుందని తెలిపారు.

సిగరెట్ల ఏజెన్సీలో భారీ చోరీ

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్లలో దొంగలు తెగబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సిగరెట్ల ఏజెన్సీ తాళాలు ధ్వంసం చేసి భారీ మొత్తంలో సిగరెట్లను గూడ్స్ వాహనంలో తీసుకెళ్లారు. బాధిత వ్యాపారి, ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీప కాలనీలో విఘ్నేశ్వర ఏజెన్సీకి సంబంధించిన హోల్‌సేల్ దుకాణం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు గూడ్స్ వాహనం తీసుకొచ్చి దుకాణం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. వివిధ బ్రాండ్లకు చెందిన 32 కార్టన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లారు. ఉదయం 6 గంటలకు ఏజెన్సీ ఎదుట కిరాణం నిర్వహించే వ్యాపారి.. తాళం ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చారు. దుకాణం సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా తెల్లవారుజామున 3 గంటల తర్వాత దొంగలు గూడ్స్ వాహనంలో వచ్చి సిగరెట్ల కార్టన్లు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. రూ.32 లక్షల విలువైన సిగరెట్లు పోయాయని బాధితుడు మణికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇదే ఏజెన్సీలో రెండేళ్ల క్రితం రూ.5లక్షల విలువైన సామగ్రి, నగదు అపహరించారు.


సీసీ కెమెరా ఫుటేజీలో గూడ్స్ వాహనంలో సిగరెట్ల కార్టన్లు పెడుతున్న దొంగలు



చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ. 10 గం. నుంచి మ. 1 వరకు

వనపర్తి: 8074538150 | వనపర్తి మార్కెట్: 8008573864
అమరచింత: 9490237200 | పెబ్బేరు: 9121229043

అమరచింత, న్యూస్‌టుడే



సమస్య : పట్టణంలోని 5వ కాలనీలో వీధి దీపాల తీగల లైన్లకు కేబుల్ తీగ తగిలి ప్రమాదకరంగా ఉంది. కేబుల్ తీగ వల్ల ఉన్న ఇనుప స్తంభానికి కట్టి ఉండటంతో వర్షం వస్తే షాక్ వస్తోంది. - నర్సింహులు, అమరచింత

సమాధానం : 5వ కాలనీలో వీధి దీపాల తీగల లైన్లకు కేబుల్ తీగలు ఎక్కడైనా తగిలి ఉంటే వాటిని సరి చేయించి సమస్య పరిష్కరిస్తాం. - వి.మంగమ్మ, పుర ఛైర్‌పర్సన్, అమరచింత

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర** వెంకటేశ్వర: **విశ్వం**
శ్రీరామా: **వేట్టయన్** – న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వనపర్తి పట్టణం కొత్తకోట రహదారిలో ఏర్పాటు చేసిన స్తంభాలకు వైర్లు అమర్చేందుకు సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ పట్టణ ఏఈ రాజయ్యగౌడ్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని ఉపకేంద్రం పరిధిలోని వల్లభ్‌నగర్, కేడీఆర్‌నగర్, రాంనగర్‌కాలనీ, బసవన్నగడ్డ, బ్రహ్మంగారివీధిలో కొంతభాగం, సుభాష్‌వాడ, పాతబస్టాండు, రాజీవ్‌చౌక్ నుంచి అంబేడ్కర్‌చౌరస్తా, బీఎస్‌ఎన్ఎల్, పురపాలిక కార్యాలయం, ఆర్టీసీ డిపోరోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, శంకర్‌గంజ్, నాగరం చౌరస్తాలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్తు ఏఈ కిరణ్‌కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదుట ఉన్న చెట్టును తొలగిస్తున్న కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

ఉన్నతాధికారుల అనుమతితో దుకాణాలు కేటాయిస్తాం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పాత మార్కెట్ యార్డు ఆవరణలో సమీకృత మార్కెట్ భవనంలోని దుకాణాలను ఉన్నతాధికారుల అనుమతితో త్వరలోనే లబ్ధిదారులకు కేటాయిస్తామని మార్కెట్‌యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్లు, మార్కెట్‌యార్డు సిబ్బందితో ఆయన మాట్లాడారు. సమీకృత భవనంలోని మొదటి, రెండో అంతస్తులోని 81 దుకాణాలను వివిధ కేటగిరిలకు చెందిన వారికి కేటాయించామన్నారు. జాబితాను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో కూరగాయలు, పండ్లు, మాంసాహారం విక్రయాలు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు.

కృష్ణవేణి చెరకు రైతు సంఘం అధ్యక్షుడిగా రాజన్న

అమరచింత, న్యూస్‌టుడే : కృష్ణవేణి చెరకు రైతు సంఘం మహబూబ్‌నగర్, కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా అమరచింత వాసి కె.రాజన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ముఖ్య సలహాదారులు రామచందర్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా వాసారెడ్డి, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి (నాగల్‌కడ్మూర్), సంజీవరెడ్డి (కొత్తపల్లి), ప్రధాన కార్యదర్శిగా జి.రవి (మస్తీపూర్), సహాయ కార్యదర్శులుగా జి.శివుడు (పెబ్బేర్), కె.నారాయణ (సింగంపేట), రాజశేఖర్‌రెడ్డి (మూలమల్ల), కోశాధికారిగా చంద్రసేనారెడ్డి (మస్తీపూర్), జిల్లా సభ్యులుగా నాగేంద్రం, షాలిమియా, రంగారెడ్డి, రాజు, తిరుపతయ్య, రవీందర్ ఎన్నికయ్యారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

పాన్‌గల్, న్యూస్‌టుడే : మల్లాయిపల్లి గ్రామానికి చెందిన బిల్లా శేఖర్‌రెడ్డి గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లి ఈనెల 10న మృతిచెందారు. బాధిత నిరుపేద కుటుంబానికి గ్రామానికి చెందిన రెడ్డిమిత్రులు, శ్రేయోభిలాషులు ఆదివారం రూ.45 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

‘రైతుల్ని మోసం చేసింది భారాసనే’

కొత్తకోట, న్యూస్‌టుడే: రైతుల్ని మోసం చేసింది భారాస ప్రభుత్వమేనని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. రైతు భరోసా వేయడం లేదంటూ వారు ఆందోళన చేపట్టడాన్ని ఆయన ఖండిస్తూ మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామంటూ ఐదేళ్లు కాలయాపన చేసి వారిని అప్పులపాలు చేసింది భారాస నాయకులు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో రాములు సాగర్, రాములుయాదవ్ పాల్గొన్నారు.

జనగామ జిల్లాలో దుప్పల్లి యువకుడి మృతి

మదనాపురం, న్యూస్‌టుడే : జనగామ జిల్లా దేవరుప్పల మండలంలోని గొల్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన భరత్ (20) మృతి చెందారు. గ్రామానికి చెందిన మహేందర్, భాగ్యమ్మ దంపతుల కుమారుడు భరత్ నాలుగేళ్ల నుంచి హైదరాబాద్‌లో ప్లంబర్ పని చేస్తూ జీవనం సాగించేవారు. ఆదివారం స్నేహితుడితో కలిసి దేవరుప్పల వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా దేవరుప్పల మండలంలోని గొల్లపల్లి సమీపంలో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో భరత్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది.



భరత్

దాడి ఘటనలో వ్యక్తి రిమాండ్

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఈ నెల 8న మండలంలోని మానాజీపేట గ్రామంలో మాజీ సర్పంచి సతీశ్‌కుమార్‌పై జరిగిన దాడి ఘటనలో రాజనాల ఆంజనేయులును శనివారం రాత్రి అరెస్ట్ చేశామని ఎస్సై సురేశ్‌గౌడ్ ఆదివారం తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు రాజనాల బాలరాజు కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు.

భారాస నాయకులపై కేసు

మదనాపురం, న్యూస్‌టుడే : భారాస ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనలో ఆపార్టీ నాయకులపై కేసు నమోదు చేశామని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజారవాణాకు ఆటంకంతో పాటు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ధర్నా చేశారని పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : అనుమతి లేకుండా రాస్తారోకో చేసినందుకు పలువురు భారాస నాయకులపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పాన్‌గల్‌లో భారాస నాయకులు సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయడం, ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కల్గించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రైవేటు వైపు.. పాడి రైతుల చూపు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రభుత్వ నిర్వహణలోని పాలశీతలీకరణ కేంద్రం ద్వారా పాలసేకరణ జరుగుతున్నా.. పాడి రైతులు మాత్రం ప్రైవేటు డెయిరీల వైపు అడుగులేస్తున్నారు. సకాలంలో వీరికి డబ్బులు అందకపోవడమే ఇందుకు కారణం. సుమారు 40 ఏళ్ల కిందట వనపర్తి మర్రికుంటలో పాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో విజయ పేరుతో పాలప్యాకెట్లు, ఇతర పాల పదార్థాలు తయారు చేసి విక్రయించే వారు. 25 ఏళ్ల నుంచి ఒక్కొక్కటిగా ప్రైవేటు కేంద్రాలు వెలియడంతో.. పాడి రైతులు వాటి వైపు మొగ్గు చూపారు. ప్రభుత్వ పాలశీతలీకరణ కేంద్రానికి పాల రాక తగ్గిపోయింది. జిల్లాలో పాలప్యాకెట్లను తయారుచేసే యంత్రాలను ఉమ్మడి పాలమూరు జిల్లాలోని షాద్‌నగర్‌కు తరలించారు.


బిల్లుల జాప్యమే కారణం : వనపర్తిలోని పాలశీతలీకరణ కేంద్రానికి పాలు పోసే పాడి రైతుల పశువులకు దాణా, నట్టల నివారణ మందు, గాలికుంటు టీకాలు వేయిస్తారు. వనపర్తి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడక ముందు ఈ కేంద్రానికి రోజు ఆరువేల లీటర్లకు పైగా పాల సేకరణ జరిగేది. ప్రస్తుతం నియోజకవర్గంలోని 39 గ్రామాల నుంచి 436 మంది రైతుల నుంచి 3,200 లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. వీరికి డబ్బు చెల్లింపు ఆలస్యంగా జరుగుతోంది. ప్రైవేటు డెయిరీ వారు పాలు పోసిన రోజే వెన్నశాతాన్ని బట్టి డబ్బు చెల్లిస్తున్నారు. అదే రోజు చేతికి డబ్బు అందుతుండటంతో పాడి రైతులు వీటి వైపు వెళ్తున్నారు. పట్టణంలో పాలకు అధిక డిమాండ్ ఉండటం, రైతులకు సకాలంలో డబ్బులు అందుతుండటంతో ఇతర ప్రాంతాల రైతులు కూడా ప్రైవేటు కేంద్రాలకు వస్తున్నారు. ప్రభుత్వం పాలశీతలీకరణ కేంద్రంపైన దృష్టి సారించి అభివృద్ధిలోకి తీసుకువస్తే జిల్లా ప్రజలకు నాణ్యమైన పాలు అందే అవకాశముంటుందని, కల్తీ నిరోధించిన వారవుతారని ప్రజలు కోరుతున్నారు.



మర్రికుంటలోని పాలశీతలీకరణ కేంద్రం

రూ.25 లక్షలు బకాయి : బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాడిరైతులు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. వనపర్తి పాలశీతలీకరణ కేంద్రానికి పాలు పోసే 436 మంది రైతులకు మూడు నెలల బకాయిలు రూ.75 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. ఆందోళన అనంతరం రూ.50 లక్షలు వారి ఖాతాలో జమ చేశారు. ఇంకా రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంది. బకాయి బిల్లులు ఎప్పుడు వస్తాయోనని పాడి రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం నుంచి మంజూరైన వెంటనే జమ చేస్తాం : మూడు నెలలకు చెందిన పాల బిల్లులను రైతుల ఖాతా జమ కాలేని మాట వాస్తవమే. ఇటీవల రెండునెలలకు సంబంధించి రూ.50 లక్షలు వారి ఖాతాలో జమ అయ్యాయి. ప్రభుత్వం నుంచి మంజూరైన వెంటనే జమ చేస్తాం. ప్రభుత్వం నుంచి ప్రధానమంత్రి ఫసల్ యోజన, కిసాన్‌క్రెడిట్, ముద్ర పథకాల నుంచి 75 మందికి సుమారు రూ.కోటితో పాడిగేదెలు పంపిణీ చేశాం. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి. - ప్రాణేష్‌కుమార్, మేనేజర్, పాతశీతలీకరణ కేంద్రం వనపర్తి



శ్రావణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

యువ ఉద్యోగినికి ఎమ్మెల్యే సన్మానం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన శ్రావణి ఇటీవల జేఎల్‌ఎమ్‌లో ఉద్యోగం సాధించారు. పట్టణంలోని నందిహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆమెను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం..

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : గోపాల్‌పేటకు చెందిన ఎర్రగొర్ల సత్యమ్మ, చిన్న బాలమయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

ఉద్యోగులకు సత్కారం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆయా శాఖల్లో ఉద్యోగం సాధించిన జిల్లాకు చెందిన సందీప్‌రెడ్డి, జేజే అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీహర్షరెడ్డి, శ్రావణి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవళిక, రామకృష్ణారెడ్డిని ఆదివారం నాగవరంలోని రెడ్డిసేవా సమితి కార్యాలయంలో సమితి కమిటీ నాయకులు సన్మానించారు. వీరితో పాటు విశ్రాంత ఉద్యోగులు వెంకటరెడ్డి, శేషిరెడ్డిలను సత్కరించారు. బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవికి సమితి ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవ సమితి నాయకులు పాల్గొన్నారు.

మూలమల్లలో క్రీడా ప్రాంగణం ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని మూలమల్ల గ్రామంలో దేశాయ్ సరళాదేవి, లక్ష్మారెడ్డిల స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు విరాళంగా సమకూర్చి, అభివృద్ధిపరచిన క్రీడా ప్రాంగణాన్ని ఆదివారం సాయంత్రం మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సరళాదేవి, లక్ష్మారెడ్డిల విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో యువకులు, విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణం సమకూర్చడం అభినందనీయమన్నారు. క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు, వ్యాయామశాల ఏర్పాటుకు, క్రీడా పరికరాలు సమకూర్చేందుకు లక్ష్మారెడ్డి కుటుంబం చొరవ తీసుకొన్నారన్నారు. కార్యక్రమంలో క్రీడాప్రాంగణ దాతలు దేశాయ్ పద్మజా కరుణాకర్ రెడ్డి, పాశం వనజా గోవర్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మండలంలోని గోపల్దిన్నెలో జరిగిన 7వ మండల మహాసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా పని చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, మహబూబ్ పాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



ఆత్మకూరు గాంధీచౌక్ కూడలిలో ధర్నా



అమరచింతలో రాస్తారోకో



శ్రీరంగాపురంలో..

ప్రభుత్వ వైఖరితో రైతుల ఆశలపై నీళ్లు : భారాస



పెబ్బేరులో నిరసన

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : ఈ సీజన్‌లో రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించడాన్ని నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని సుభాష్ చౌరస్తాలో భారాస మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. పుర అధ్యక్షురాలు కరుణశ్రీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని ధ్వజమెత్తారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి, పుర ఉపాధ్యక్షుడు కర్రెస్వామి, కౌన్సిలర్ చిన్నఎల్లారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : రైతులకిచ్చిన హామీలను విస్మరించి రైతు భరోసా ఇవ్వలేమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం పెద్దమందడిలో భారాస నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రఘుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : రైతు బంధు పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఆత్మకూరు గాంధీచౌక్ కూడలిలో భారాస శ్రేణులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పార్టీ రేచింతల సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, మండల నాయకులు విరేషలింగం, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, పార్టీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.



కడుకుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : రైతుభరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని మండలంలోని కడుకుంట్ల గ్రామంలో రైతులు గాంధీ విగ్రహం వద్ద మౌనం పాటించి నిరసన తెలిపారు.

అమరచింత, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వర్షాకాలంలో రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని ఆదివారం గాంధీ కూడలిలో భారాస ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రాజు, భారాస పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులుగౌడ్, బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో భారాస నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వానికి మూసినది ప్రక్షాళనపై ఉన్న శ్రద్ధ, రైతులకు సంక్షేమ పథకాలు అందిచడంలో లేదని భారాస మండలాధ్యక్షుడు ఆర్.వెంకటస్వామి, సింగల్‌విండో ఛైర్మన్ జగన్నాథంనాయుడు పేర్కొన్నారు. రైతు భరోసా అందించకపోవడాన్ని నిరసిస్తూ శ్రీరంగాపురంలో మండల భారాస నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడమే కాకుండా రైతుబంధు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రైతు భరోసా విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఆదివారం పాన్‌గల్‌లో భారాస ఆధ్వర్యంలో రాస్తారోకో, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు రంగినేని అభిలాష్‌రావు, వెంకటయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందని భారాస మండల అధ్యక్షుడు బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం గోపాల్‌పేటలో రాస్తారోకో నిర్వహించి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో భారాస నాయకులు పాల్గొన్నారు. రేవల్లిలో భారాస నాయకులు నల్లకండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహం చేశారు.



ఖిల్లాగణపురంలో..

వీపనగండ్ల(చిన్నంబావి), న్యూస్‌టుడే: ఎన్నికల హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భారాస నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వీపనగండ్లలో వారు ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, విండో ఛైర్మన్ రామన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : ఖిల్లాగణపురంలో భారాస నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల భారాస అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి అంజనేయులుగౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, నాయకులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..



పెద్దమందడిలో..



పాన్‌గల్‌లో..

ఆలయాల విధ్వంస కుట్రను ప్రభుత్వం ఛేదించాలి



కొత్తకోట చౌరస్తాలో ధర్నా చేస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

కొత్తకోట, న్యూస్‌టుడే: మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా జరుగుతున్న హిందూ దేవతా విగ్రహాలపై దాడుల్ని నివారించడంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందని హిందూవాహిని జిల్లా నాయకులు శ్రీకాంత్ యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహ విధ్వంసం సంఘటనను నిరసిస్తూ కొత్తకోటలో హిందూవాహిని, అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆలయాలపై జరుగుతున్న దాడుల వెనుక దాగిఉన్న కుట్రల్ని ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రహ్లాద్, నవీన్‌కుమార్, రాఘవేందర్, గోపిస్వామి, నాగరాజు, శ్రీశైలం, నరేష్, గౌతంరెడ్డి, శివప్రసాద్, జగదీశ్, మనోజ్ పాల్గొన్నారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : ముత్యాలమ్మ ఆలయంలోని విగ్రహన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని నిరసన చేస్తున్న హిందువులపై జరిగిన లాఠీఛార్జిని ఖండిస్తూ ఆదివారం పెబ్బేరు సుభాష్‌చౌరస్తాలో హిందూ వాహిని శ్రేణులు రాస్తారోకో చేశారు. ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ జాగృతం సభ్యులు, హిందూ వాహిని శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారులకు నిధులు

అమరచింత, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇచ్చిన హామీతో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి అమరచింత మండలంలోని గ్రామీణ రహదారులను బీటీ రహదారులుగా మార్చేందుకు నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ కల్లుగీత సెల్ రాష్ట్ర ఛైర్మన్ కె.నాగరాజుగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన ధర్మపూర్ గ్రామ మట్టి రహదారిని పరిశీలించి మాట్లాడారు. ధర్మపూర్ గ్రామ బీటీ రహదారికి రూ.2 కోట్లు, నందిమల్ల గ్రామ బీటీ రహదారికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యూబ్‌ఖాన్, నాయకులు మహేదర్‌రెడ్డి, అరుణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నను ఆశయాలు నెరవేరుద్దాం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : గౌడ కులస్థులు సర్దార్ సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు రామన్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి పెబ్బేరు మండల గౌడ కులస్థుల ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పలుస శ్రీనువాసులు గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి ఆర్థికంగా, విద్య, సామాజిక రంగాలలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, జిల్లా గౌడ సంఘం సలహాదారుడు శ్రీనువాసులు గౌడ్, రవీందర్ గౌడ్, సురేందర్ గౌడ్, వెంకటన్న గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఏఈవోలు

కొత్తకోట, న్యూస్‌టుడే : పంటల డిజిటల్ సర్వే చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని ఏఈవోలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులు చలో హైదరాబాద్ పేరుతో భవిష్యత్తు కార్యాచరణ కోసం రాష్ట్ర రాజధానికి తరలి వెళ్లారు. వ్యవసాయ శాఖలో ఇప్పటికే 49 రకాల సేవల్ని ఒక్కరే నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతుండగా కొత్తగా డిజిటల్ సర్వే చేయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు.

భాజపాను బలోపేతం చేద్దాం

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : జిల్లాలో భాజపాను బలోపేతం చేద్దామని జడ్పీ మాజీ ఛైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పొలికెపాడు గ్రామంలో భాజపా నాయకులతో కలిసి ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

47 ఏళ్లకు స్నేహితుల కలయిక

కొత్తకోట,న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 19976-77లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మమ్మలు, తాతయ్యలుగా మారి పోయిన వారందరూ 47 ఏళ్ల అనంతరం కలుసుకుని ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయుల్లో సైన్స్ టీచర్ గోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భీమ ప్రభాకర్, మురళీధర్ రెడ్డి, విష్ణు, వేమారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, లక్ష్మారెడ్డి తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు.

16 సంవత్సరాల అనంతరం..

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 16 ఏళ్ల అనంతరం ఆదివారం ఓ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి గురువులు నరసింహ గౌడ్, ఇంద్రా రావు, శర్మ, శశికళ, సుబ్బలక్ష్మి, మన్నెమ్మ, మధుసూదన్‌ను సన్మానించారు.



కొత్తకోట : గురువుతో పూర్వవిద్యార్థులు



పెబ్బేరు నాటి గురువులతో పూర్వ విద్యార్థులు